ప్రభుత్వ పథకాలు నిరుపేదలకు అందాలి

- **ఎస్సీ, ఎస్టీ కేసుల్లో తక్షణమే ఎఫ్ఐఆర్ నమోదు చేయాలి**
- **జాతీయ ఎస్సీ కమిషన్ సభ్యుడు రామ్‌చందర్**

సమావేశంలో మాట్లాడుతున్న జాతీయ ఎస్సీ కమిషన్ సభ్యుడు వడ్డేపల్లి రాంచందర్

భూపాలపల్లి రూరల్, అక్టోబర్ 17 : ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రతి పథకం నిరుపేదలకు అందాలని జాతీయ ఎస్సీ కమిషన్ సభ్యుడు వడ్డేపల్లి రాంచందర్ అన్నారు. గురువారం ఐడీవోసీ కార్యాలయంలో కలెక్టర్ రాహుల్‌శర్మ, ఎస్పీ కిరణ్‌ఖరేతో కలిసి అన్ని శాఖల అధికారులతో ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పథకాల అమల్లో నిర్లక్ష్యం జరిగితే అధికారులపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. భూమి లేని నిరుపేదలకు భూమి ఇవ్వాలని, అక్రమాలు జరిగితే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. రుణాలు పొందిన లబ్ధిదారులకు సకాలంలో సబ్సిడీ మంజూరుకు చర్యలు తీసుకోవాలని సూచించారు. విడుతల వారీగా సబ్సిడీ మంజూరు చేయడం వల్ల లబ్ధిదారులకు ఆర్థికభారం అవుతుందని, సకాలంలో సబ్సిడీ జమ కాకపోవడంతో సిబిల్ స్కోర్ తగ్గి లబ్ధిదారులకు బ్యాంకర్లు రుణాలు ఇవ్వడం లేదని తెలిపారు. ప్రధానమంత్రి ఎంప్లాయిమెంట్ గ్యారెంటీ స్కీమ్‌ను ఎక్కువ మంది లబ్ధిదారులు వినియోగించుకునేలా అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. రుణాలు మంజూరు చేసేందుకు అన్ని బ్యాంకుల కంట్రోలర్లు చర్యలు తీసుకోవాలని ఎల్డీఎంను ఆదేశించారు.

ఇండస్ట్రియల్ పార్కులో స్థల కేటాయింపులో ఎస్సీలకు రోస్టర్ పాటించేలా చర్యలు తీసుకోవాలని పరిశ్రమల శాఖ జీఎంను ఆదేశించారు. అంగన్‌వాడీ కేంద్రాల సేవలను నిరంతరం పర్యవేక్షించాలని సంక్షేమ అధికారిని ఆదేశించారు. పీఎం ఆవాస యోజనలో ఇల్లు లేని నిరుపేద ఎస్సీలకు ఇండ్లు మంజూరు చేయాలని, మరుగుదొడ్లు లేని ఎస్సీ కుటుంబాలను గుర్తించి మరుగుదొడ్లు మంజూరు చేయాలన్నారు. ఎస్సీ, ఎస్టీ కేసుల్లో తక్షణమే ఎలాంటి విచారణ లేకుండా ఎఫ్ఐఆర్ నమోదు చేయాలని ఆదేశించారు. అన్ని శాఖల్లో అమలవుతున్న సంక్షేమ కార్యక్రమాల అమలు తీరును సమీక్షించిన ఆయన కలెక్టర్, ఎస్పీ, అధికారులను అభినందించారు. ఈ సమావేశంలో జాతీయ ఎస్సీ కమిషన్ సంచాలకుడు డాక్టర్ సునీల్‌కుమార్‌బాబు, రీసెర్చ్ అధికారి వరప్రసాద్, కాటారం సబ్ కలెక్టర్ మయాంక్ సింగ్, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విజయలక్ష్మి, ఎస్సీ అభివృద్ధి అధికారి సునీత, ఆర్డీవో మంగీలాల్ పాల్గొన్నారు.

బాధితులకు మాజీ ఎమ్మెల్యే పరామర్శ

మృతుడి కుటుంబాన్ని పరామర్శిస్తున్న గండ్ర వెంకటరమణారెడ్డి

చిట్యాల (మొగుళ్లపల్లి), అక్టోబర్ 17 : మండలంలోని పలు గ్రామాలకు చెందిన బాధిత కుటుంబాలను మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి పరామర్శించి ఆర్థిక సాయం అందించారు. గురువారం ఆయన బీఆర్ఎస్ పెద్దకోమటిపల్లి గ్రామ అధ్యక్షుడు గడ్డం రాజు బాబాయి కొమురయ్య, మొండయ్య, రంగాపురం గ్రామానికి చెందిన లోకులబోయిన మహేందర్ ఇటీవల మృతిచెందగా వారి కుటుంబాలను పరామర్శించి మృతుల చిత్రపటాల వద్ద నివాళులర్పించారు. అలాగే పెద్దకోమటిపల్లి గ్రామ సీనియర్ నాయకుడు ముత్యాల శ్రీనివాస్ కుమారుడు బన్నుకు ప్రమాదవశాత్తు కాలుకు గాయమవడంతో వారి ఇంటికి వెళ్లి పరామర్శించారు. ఆయన వెంట పార్టీ మండల అధ్యక్షుడు బల్గూరి తిరుపతిరావు, మాజీ జడ్పీటీసీ జోరుక సదయ్య, చిట్యాల మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ కోడూరి రమేశ్, నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

మంగపేటలో బడే నాగజ్యోతి పర్యటన

మృతురాలి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న నాగజ్యోతి

మంగపేట, అక్టోబర్ 17 : మండలంలో గురువారం ములుగు జడ్పీ మాజీ చైర్‌పర్సన్, బీఆర్ఎస్ ములుగు నియోజకవర్గ ఇన్‌చార్జి బడే నాగజ్యోతి పర్యటించారు. కొత్తమల్లూరుకు చెందిన బీఆర్ఎస్ మండల యూత్ నాయకుడు గుండారపు రమేశ్ తల్లి నాగమ్మ, తిమ్మంపేటకు చెందిన పార్టీ ఎస్సీసెల్ వి భాగం మండల మాజీ అధ్యక్షుడు పూసల నర్సింహారావు తల్లి ముత్తమ్మ ఇటీవల మృతి చెందారు. బాధిత కుటుంబాలను నాగజ్యోతి పరామర్శించి, మృతుల చిత్రపటాల వద్ద నివాళులర్పించారు. మండల యూత్ నాయకుడు గౌని రమేశ్ గృహప్రవేశానికి, మామిడిగూడెంకు చెందిన యా లం గౌతమి--రేవంత్ రిసెప్షన్ వేడుకకు ఆమె మండల నాయకులతో కలిసి హాజరయ్యారు. ఆయా కార్యక్రమాల్లో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు లక్ష్మీనారాయణ, నాయకులు జగదీశ్, మండల ప్రధాన కార్యదర్శి గుండేటి రాజు యాదవ్, జిల్లా సీనియర్ నాయకుడు తుమ్మ మల్లారెడ్డి, పీఏసీఎస్ వైస్‌చైర్మన్ కాడబోయిన నరేందర్, మల్లూరు దేవస్థాన మాజీ చైర్మన్ నూతిలకంటి ముకుందం, మండల నాయకులు, చిట్టిమల్ల సమ్మయ్య, చల్లగురుగుల తిరుపతి, కర్రీ శ్యాంబాబు, ఉడుగుల శ్రీనివాస్‌యాదవ్, యగ్గడి అర్జున్, పొదెం రాంబాబు, మునిగాల సాంబులు, ఏటూరునాగారం మాజీ సర్పంచ్ ఈసం రామ్మూర్తి, సోషల్ మీడియా వారియర్స్ గుడివాడ శ్రీహరి, గంధం కిశోర్, పిల్లలమర్రి వేణు, మునిగాల నరేశ్, పూజారి సతీశ్ పాల్గొన్నారు.

బైక్‌ను ఢీకొట్టిన ఇసుక లారీ

- **ఒకరు మృతి, మరొకరికి గాయాలు**
- **న్యాయం కోసం రోడ్డుపై కుటుంబ సభ్యుల ఆందోళన**

మహదేవపూర్, అక్టోబర్ 17 : ద్విచక్ర వాహనాన్ని ఇసుక లారీ ఢీకొట్టడంతో ఒకరు మృతి చెందగా మరొకరికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ ఘటన మండలంలోని బెగ్లూర్ గ్రామంలో గురువారం జరిగింది. స్థానికుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన దోమల రమేశ్ (35), ముల్కల లక్ష్మీనారాయణ బైక్‌పై సమీపంలోని వ్యవసాయ క్షేత్రానికి గ్రామంలోని ఎల్‌టీ రహదారిపై వెళ్తున్నారు. ఈ క్రమంలో ఎదురుగా వస్తున్న ఇసుక లారీ బైక్‌ను ఢీకొట్టడంతో రమేశ్ లారీ ముందు టైర్ కింద ఇరుక్కుపోయి అక్కడికక్కడే మృతి చెందాడు. లక్ష్మీనారాయణకు తీవ్ర గాయాలు కాగా గమనించిన స్థానికులు అతడిని మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లి, మెరుగైన చికిత్స కోసం భూపాలపల్లికి తరలించారు. మృతుడి కుటుంబ సభ్యులు న్యాయం కోసం రోడ్డుపై ధర్నా చేపట్టారు. విషయం తెలుసున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని సర్దిచెప్పడంతో ఆందోళన విరమించారు. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు

రామప్పలో అలరించిన పేరిణి నాట్యం

రామప్పలో వరల్డ్ హెరిటేజ్ ప్రోగ్రాం వలంటీర్స్, అధికారులు

వెంకటాపూర్, అక్టోబర్ 17 : మండలంలోని పాలంపేట గ్రామంలోని రామప్పలో నిర్వహిస్తున్న వరల్డ్ హెరిటేజ్ వలంటీర్ ప్రోగ్రాం మూడో రోజు గురువారం కొనసాగింది. వలంటీర్స్, యువ టూ రిజం క్లబ్ సభ్యులకు గురువారం ఉదయం రామప్పలో యోగా గురువు రాంబాబు ఆధ్వర్యంలో గంటపాటు యోగా క్లాసులు నిర్వహించారు. అనంతరం పాలంపేట గ్రామంలోని రైతువేదికలో ప్రొఫెసర్ మధు వోట్టరీ పురాతన కట్టడాలకు వాడిన మెటీరియల్స్‌పై వివరించారు. సాయంత్రం రామప్ప దేవాలయంలో పేరిణి రంజిత్ ఆధ్వర్యంలో ఆయన శిష్యులు తోడెంగ సంతోష్, తోడసం గురుదేవ్, మర్కాల లోహిత్, రేగుల చందు, పల్నాటి శ్రీజ, బండారి తేజస్విని పిడుసోజు సమిక్ష, జంటి రిత్విక నాట్య ప్రదర్శన చేయగా వలంటీర్స్ తిలకించారు. కార్యక్రమంలో ప్రొఫెసర్ పాండురంగారావు, అసిస్టెంట్ టూరిజం ప్రమోషన్ కుసుమ జగదీశ్, కాకతీయ హెరిటేజ్ ట్రస్టు సభ్యులు శ్రీధర్‌రావు, శ్రీనివాస్, టూరిజం, పురావస్తుశాఖల సిబ్బంది పాల్గొన్నారు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్

WANTED

jobs Apply Now!

★ఆదిత్య UPVC Windows Superwisers కావలెను. వెంటనే సంప్రదించగలరు. సెల్ నెంబర్: 9849943483, 8309924558
NTW-000

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

For Classified Ads
Please Contact...
9182777552
HANAMKONDA
9182777563
9182777961
WARANAGAL
9182777556
JAYASHANKAR BHUPALPALLY
9182777559
MULUGU
9182777135
MAHABUBABAD
9182777557
JANGAON
9182777565

అక్రమంగా మట్టి తరలింపు

మల్హర్, అక్టోబర్ 17 : తాడిచెర్ల శివారులోని అటవీ ప్రాంతం నుంచి రెండు రోజులుగా ఎర్రమట్టిని అక్రమంగా తరలిస్తున్నారు. ప్రభుత్వ భూమిలో మట్టిని తవ్వి ట్రాక్టర్ల ద్వారా పెద్దపల్లి జిల్లా ముత్తారం మండలం జిల్లెల్లపల్లి మానేరు నదిలోని ఇసుక క్వారీకి తరలిస్తున్నట్లు తెలుస్తోంది. రెవెన్యూ అధికారులు చోద్యం చూస్తున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. ముత్తారం మండలంలోని మానేరు నది ఇసుక క్వారీలోకి ట్రాక్టర్లు సులువుగా రాకపోకలు సాగించేందుకు తాత్కాలిక రోడ్డు నిర్మాణం కోసం మట్టి తరలిస్తున్నట్లు తెలుస్తున్నది. రెవెన్యూ, పోలీస్ అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు. ఈ విషయమై తహసీల్దార్ రవికుమార్‌ను వివరణ కోరగా మట్టిని తరలింపునకు ఎలాంటి అనుమతులు లేవన్నారు. అక్రమంగా తరలిస్తున్నట్లు తమ దృష్టికి రాలేదని, విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకుంటామన్నారు.

సెల్‌ఫోన్ల అప్పగింత

గణపురం, అక్టోబర్ 17 : పోగొట్టుకున్న ఫోన్లను గురువారం పోలీసులు బాధితులకు అప్పగించారు. మండల కేంద్రానికి చెందిన ఎండీ ఇమ్రాన్ పాషా 15 రోజుల క్రితం గణపురంలో బైక్‌పై వెళ్తుండగా మార్గమధ్యంలో సెల్ పడిపోయింది. పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. బస్వరాజుపల్లికి చెందిన గండు రమేశ్ ఫోన్ రెండు నెలల క్రితం భూపాలపల్లి నుంచి హైదరాబాద్‌కు బస్సులో వెళ్తుండగా చోరీకి గురైంది. స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. సీఈఐఆర్ పోర్టల్ ద్వారా వాటిని గుర్తించి గురువారం హెడ్ కానిస్టేబుల్ వారికి అప్పగించారు. ఇందుకు కృషి చేసిన కానిస్టేబుల్ కనుకుంట్ల యాకేశ్‌ను ఎస్సై రేఖ అశోక్ అభినందించారు.

శ్రీరామ్‌పతి కాల్వ గండి పూడ్చివేత

శ్రీరామ్‌పతి కాల్వకు పడిన గండిని పూడుస్తున్న అధికారులు

గోవిందరావుపేట, అక్టోబర్ 17 : లక్నవరం సరస్సు ప్రధాన కాల్వలో ఒకటైన శ్రీరామ్‌పతి గండిని ఐబీ అధికారులు ఎట్టకేలకు పూడ్చారు. గురువారం సాయంత్రం గండి పూడ్చడంతో ఆయా కాల్వలకు అధికారులు నీటిని విడుదల చేశారు. కాల్వ చివరి ఆయకట్టు గ్రామమైన గాంధీనగర్, మొద్దులగూడెం గ్రామ రైతులకు నీరు సక్రమంగా అందేందుకు అక్రమంగా సాగు చేస్తున్న రైతులు తమ మోటర్లను తీసివేయాలని గ్రామంలో డప్పు చాటింపు వేశారు. అంతేకాకుండా పోలీసుల సహకారం కావాలని స్థానిక ఏఈ క్రాంతి పస్రా ఎస్సై కమలాకర్‌ను కలిసి విన్నవించారు. అక్రమ సాగుదారులపై చట్టపరంగా చర్యలు తీసుకుంటామని, ఎంతటి వారినైనా ఉపేక్షించేది లేదని ఐబీ అధికారులు తెలిపారు.

ఉదయశ్రీకి జీఎం అభినందన


ఉదయశ్రీ

భూపాలపల్లి రూరల్, అక్టోబర్ 17 : ఉత్తరాఖండ్‌లోని మహరాణా ప్రతాప్ స్పోర్ట్స్ కాలేజీలో అక్టోబర్ 16,17 తేదీలలో నిర్వహించిన ఆల్ ఇండియా పబ్లిక్ సెక్టార్ అథ్లెటిక్స్ పోటీల్లో కేటీకే-6 ఇంక్లైన్ గనిలో జనరల్ మజ్దూర్‌గా పనిచేస్తున్న ఎం ఉదయశ్రీ కోల్ ఇండియా తరపున పాల్గొని బ్రాంజ్ మెడల్ సాధించింది. ఈ సందర్భంగా గురువారం జీఎం సయ్యద్ హబీబ్ హుస్సేన్, ఎస్‌వోటు జీఎం కవీంద్ర, ఏరియా పర్సనల్ మేనేజర్ మారుతి, ఇతర అధికారులు, క్రీడాకారులు ఉదయశ్రీని అభినందించారు. ఆల్ ఇండియా లెవెల్‌లో సింగరేణి, భూపాలపల్లి పేరును నిలబెట్టినందుకు ఆమెను కొనియాడారు.

ఆరోగ్య సేవలను సద్వినియోగం చేసుకోవాలి

భూపాలపల్లి రూరల్, అక్టోబర్ 17 : ప్రభుత్వం అందిస్తున్న ఆరోగ్య సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ రాహుల్‌శర్మ అన్నారు. గురువారం కలెక్టరేట్‌లో వైద్యాధికారులతో కలెక్టర్ సమీక్ష నిర్వహించి మాట్లాడారు. పోషకాహారలోపం ఉన్న పిల్లలను గుర్తించి వారిని అంగన్‌వాడీ కేంద్రాల్లో చేర్చాలన్నారు. అన్ని ప్రాథమిక, ఉప ఆరోగ్య కేంద్రాల్లో ఆరోగ్య సమితి సమావేశాలు నిర్వహించాలని సూచించారు. ఆయుష్మాన్ ఆరోగ్య కేంద్రాలకు కావాల్సిన సౌకర్యాలను తెలుసుకున్నారు. ఆస్పిరేషనల్ బ్లాకు మండలాలైన పలిమెల, మహాముత్తారంలో మెరుగైన వైద్య సేవలు అందించాలని ఆదేశించారు. జిల్లాలో ఏఎన్సీ రిజిస్ట్రేషన్స్ 98 శాతం జరుగుతున్నాయని, 100 శాతం చేయాలన్నారు. ఆరోగ్య సేవల అభివృద్ధి, ఆరోగ్య సదుపాయాల విస్తరణ, టీకాల పంపిణీ, మాతాశిశు సంరక్షణ కార్యక్రమాలు, గ్రామీణ ప్రాంతాల్లో వైద్య శిబిరాల నిర్వహణను వైద్యాధికారులను అడిగి తెలుసుకున్నారు. సమావేశంలో అదనపు కలెక్టర్ విజయలక్ష్మి, డీఎంహెచ్‌వో మధుసూదన్, డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ కొమురయ్య, డాక్టర్ రవి రాథోడ్, పీవోలు డాక్టర్ శ్రీదేవి, డాక్టర్ ఉమాదేవి, డాక్టర్ ప్రమోద్ కుమార్ పాల్గొన్నారు.

వృద్ధుడిపై పోక్సో కేసు నమోదు

మహాముత్తారం, అక్టోబర్ 17: మండలంలోని యామన్‌పల్లి గ్రామానికి చెందిన రత్నం రామయ్యపై పోక్సో కేసు నమోదు చేసినట్లు ఎస్సై మహేందర్‌కుమార్ తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన ఓ బాలికపై రామయ్య లైంగిక దాడికి పాల్పడినట్లు బాధితురాలి తల్లి గురువారం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. దీంతో నిందితుడిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై చెప్పారు.

వైద్య విద్యార్థులకు అన్ని సౌకర్యాలు కల్పిస్తాం

ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు

మాట్లాడుతున్న ఎమ్మెల్యే, కలెక్టర్

గణపురం, అక్టోబర్ 17 : వైద్య విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు రాకుండా మెడికల్ కళాశాలకు అన్ని సౌకర్యాలు కల్పిస్తామని ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు అన్నారు. గురువారం కలెక్టర్ రాహుల్‌శర్మతో కలిసి ఆయన వైద్య కళాశాలను సందర్శించారు. కళాశాల ప్రొఫెసర్లు, సింగరేణి జీఎం, కాంట్రాక్టర్లు, ఇంజినీరింగ్ అధికారులతో సమావేశం నిర్వహించి మాట్లాడారు. కళాశాలలో 120 మంది బాలికలు, 80 మంది బాలురు వైద్య విద్యనభ్యసిస్తున్నారని, సింగరేణి అధికారులతో చర్చించి అదనంగా రామప్ప కాలనీలో ఒక బ్లాక్, 14 క్వార్టర్లు కేటాయించాలని కోరినట్లు తెలిపారు. సీఎం రేవంత్‌రెడ్డితో మాట్లాడి భవన నిర్మాణానికి పెండింగ్ బకాయిలు మంజూరు చేయిస్తానని తెలిపారు. సంవత్సరంలో నిర్మాణం పూర్తి చేయిస్తామన్నారు. రెండో సంవత్సరం విద్యార్థుల తరగతుల నిర్వహణకు అవసరమయ్యే ప్రాక్టికల్ ల్యాబ్, లెక్చరర్ హాల్‌ను 20 రోజుల్లో అందుబాటులోకి తేవాలని ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. విద్యార్థులు కళాశాల నుంచి జిల్లా దవాఖానకు వెళ్లేందుకు రెండు బస్సులు ఏర్పాటు చేస్తామని, 21 నుంచి రెండో సంవత్సరం విద్యార్థులకు తరగతులు ప్రారంభించాలని ఆదేశించారు. కలెక్టర్ మాట్లాడుతూ విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించాలని, ప్రభుత్వం తరుపున అన్ని ఏర్పాట్లు చేస్తామన్నారు. మొదటి సంవత్సరం విద్యార్థి అడ్మిషన్లు పూర్తి కాగానే క్లాసులు ప్రారంభించాలని తెలిపారు. అధ్యాపకులు పూర్తి స్థాయిలో అందుబాటులో ఉండాలని కోరారు. అనంతరం రామప్ప కాలనీలో మెడికల్ కళాశాల విద్యార్థుల కోసం కేటాయించిన క్వార్టర్లను సింగరేణి జీఎం సయ్యద్ హబీబ్ హుస్సేన్‌తో కలిసి పరిశీలించారు. ఈ కార్యక్రమంలో వైద్య కళాశాల ప్రిన్సిపాల్ రాజేంద్రప్రసాద్, జిల్లా ప్రధాన దవాఖాన సూపరింటెండెంట్ నవీన్‌కుమార్, వైద్య కళాశాల అధ్యాపకులు పాల్గొన్నారు.

రైస్ మిల్లర్స్ అసోసియేషన్ అధ్యక్షుడిగా ప్రవీణ్

బాదం ప్రవీణ్‌తో కార్యవర్గ సభ్యులు

ములుగురూరల్, అక్టోబర్ 17 : ములుగు జిల్లా రైస్ మిల్లర్స్ అసోసియేషన్ అధ్యక్షుడి ఎన్నికకు జరిగిన పోటీల్లో ములుగు మండలం అబ్బాపురం గ్రామానికి చెందిన బాదం ప్రవీణ్ తన సమీప అభ్యర్థి కాట్రగడ్డ సతీశ్‌కుమార్‌పై విజయం సాధించి అధ్యక్షుడిగా ఎన్నికయ్యారు. మొత్తం జిల్లాలో మొత్తం 47మం ది సభ్యులు ఉండగా ఒక సభ్యుడు గైర్హాజరయ్యాడు. సతీశ్‌కుమార్‌కు 21మంది ఓట్లు వేయగా బాదం ప్రవీణ్‌కు 25మంది ఓట్లు వేయడంతో నాలుగు ఓట్ల తేడాతో బాదం ప్రవీణ్ అధ్యక్షుడిగా గెలుపొందారు. అనంతరం జిల్లా కార్యవర్గాన్ని అధ్యక్షుడు ఎంపిక చేశారు. గౌరవ అధ్యక్షుడిగా పల్లెపాటి సమ్మిరెడ్డి, ప్రధాన కార్యదర్శిగా గురిజాల సహోదర్‌రెడ్డి, జిల్లా కోశాధికారిగా ఎలగందుల మోహన్, ఆర్గనైజింగ్ సెక్రటరీగా హరినాథ్, ఉపాధ్యక్షులుగా సుదర్శన్ రెడ్డి, రఘోత్తం, జిల్లా సంయుక్త కార్యదర్శులుగా భద్రయ్య, వీఎన్ రెడ్డి, ఈసీ మెంబర్లుగా లక్ష్మీనారాయణ, ఎలేందర్‌తోపాటు శాస్వత ఆహ్వానితులుగా అనిల్‌కుమార్, శ్రావణ్‌కుమార్‌లను ఎంపిక చేశారు. బాదం ప్రవీణ్ మాట్లాడుతూ తనపై నమ్మకంతో జిల్లా అధ్యక్షుడిగా ఎన్నుకున్నందుకు అసోసియేషన్ అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తానని అన్నారు.

రోడ్డు ప్రమాదంలో కార్యదర్శికి తీవ్ర గాయాలు

గణపురం, అక్టోబర్ 17: రోడ్డు ప్రమాదంలో పంచాయతీ కార్యదర్శికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికుల కథనం ప్రకారం.. మోరంచపల్లి గ్రామ పంచాయతీ కార్యదర్శిగా విధులు నిర్వర్తిస్తున్న బండారి శరీశ్ చెల్పూర్‌లో నివాసం ఉంటున్నాడు. గురువారం సాయంత్రం ద్విచక్ర వాహనంపై భూపాలపల్లికి వెళ్లి చెల్పూరుకు వస్తుండగా కేటీపీపీ సమీపంలో డివైడర్‌ను ఢీకొన్నాడు. ఈ ప్రమాదంలో శరీశ్ తలకు తీవ్ర గాయాలయ్యాయి. గమనించిన స్థానికులు 108 వాహనంలో భూపాలపల్లి జిల్లా ఆసుపత్రికి తరలించారు. కాగా శరీశ్ పరిస్థితి విషమంగా ఉండడంతో మెరుగైన చికిత్స కోసం వరంగల్‌కు తరలించారు.

వాల్మీకి రామాయణం మన పూజ్య గ్రంథం

జయంతి వేడుకల్లో కలెక్టర్లు, ఎమ్మెల్యే


వాల్మీకి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న కలెక్టర్ దివాకర

భూపాలపల్లి రూరల్/ములుగురూరల్, అక్టోబర్ 17 : రామాయణాన్ని మహా కావ్యంగా మలిచి భారత జాతికి సన్మార్గాన్ని నిర్దేశించిన మహోన్నత వ్యక్తి మహర్షి వాల్మీకి అని ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు, జయశంకర్ భూపాలపల్లి, ములుగు కలెక్టర్లు రాహుల్ శర్మ, టీఎస్ దివాకర అన్నారు. కలెక్టరేట్లలో గురువారం మహర్షి వాల్మీకి జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు వాల్మీకి చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ ఒకే మాట, ఒకే బాణం, ఒకే పత్ని అనే రాముడి లక్షణాలు చాలా సులువుగా ప్రజలకు అర్థమయ్యేలా తన రచనలతో చేరవేసిన గొప్ప వ్యక్తి వాల్మీకి అన్నారు. భూపాలపల్లిలో జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ అధికారి శైలజ, వివిధ శాఖల జిల్లా అధికారులు, బీసీ కుల సంఘాల నాయకులు, కలెక్టరేట్ సిబ్బంది పాల్గొన్నారు. సింగరేణి జీఎం కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో ఎస్‌వోటు జీఎం కే కవీంద్ర హాజరై వాల్మీకి మహర్షి చిత్ర పటానికి పూల మాల వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో డీజీఎం రవికుమార్, డీవైజీఎం జే సురేఖ, ఐఈడీ ఆఫీసర్ వసంత్, పర్సనల్ మేనేజర్ కే మారుతి, జీవీటీసీ మేనేజర్ పాటక్, సీనియర్ సెక్యూరిటీ ఆఫీసర్ ఎస్ మురళీమోహన్ పాల్గొన్నారు.అలాగే జిల్లా పోలీస్ కార్యాలయంలో ఎస్పీ కిరణ్‌ఖరే వాల్మీకి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఓఎస్డీ బోనాల కిషన్, రిజర్వ్ ఇన్‌స్పెక్టర్లు నగేశ్, రత్నం, సీసీ ఫసీయొద్దీన్, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

ములుగులో అదనపు కలెక్టర్ మహేందర్‌జీ, డీపీఆర్వో రఫిక్, జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి అధికారి రవీందర్‌రెడ్డి, సీనియర్ సిటిజన్‌లు కనకయ్య, బోయసంఘం సభ్యులు సంతోష్, ముంజాల భిక్షపతి, మల్లేశ్, సాంబయ్య, కలెక్టరేట్ సిబ్బంది పాల్గొన్నారు.

కుమ్రం భీం పోరాటాన్ని స్ఫూర్తిగా తీసుకోవాలి

వర్ధంతిలో ఆదివాసీ సంఘాల నాయకులు


ఏటూరునాగారంలో కుమ్రం భీం విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న పీవో చిత్రామిశ్రా

ఏటూరునాగారం/తాడ్వాయి/ ములుగురూరల్/ మంగపేట/ వెంకటాపురం(నూగూరు)/కాటారం, అక్టోబర్ 17 : కుమ్రం భీం పోరాట పటిమను స్ఫూర్తిగా తీసుకోవాలని ఆదివాసీ సంఘాల నాయకులు, అధికారులు అన్నారు. కుమ్రం భీం వర్ధంతిని గురువారం ములుగు, జయశంకర్ భూపాలపల్లి జిల్లాల్లో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆదివాసీ సంఘాల నాయకులు, అధికారులు కుమ్రం భీం చిత్రపటాలు, విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ 1940లో జోడేఘాట్‌లో ఆదివాసీ హక్కుల కోసం కుమ్రం భీం పోరాటం చేసి రక్తం చిందించాడని భీం పోరాట పటిమను కొనియాడారు. ఆయన పోరాటాల ఫలితంగానే భారత రాజ్యాంగంలో ఐదు, ఆరు, షెడ్యూల్ ఏర్పాటైనట్లు తెలిపారు. ప్రభుత్వం సేవాలాల్ వర్ధంతిని అధికారికంగా నిర్వహించి కుమ్రం భీం వర్ధంతిని అధికారికంగా నిర్వహించకపోవడాన్ని తప్పుబట్టారు. ఇది ముమ్మాటికీ భీంను అవమానించడేమనన్నారు. ఏటూరునాగారంలో ఐటీడీఏ పీవో చిత్రామిశ్రా, పెసా కోఆర్డినేటర్ కొమురం ప్రభాకర్, తుడుందెబ్బ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ అరుణ్ కుమార్, ఆదివాసీ సేన రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మడే సాయిబాబా, రాష్ట్ర తుడుందెబ్బ నేత పొడెం బాబు, ఆదివాసీ నేతలు గణేశ్, ఆలం కిశోర్, సురేశ్, ముద్దెబోయిన రవి పాల్గొన్నారు. మేడారంలోని ఆదివాసీ మ్యూజియంలో కుమ్రం భీం వర్ధంతిని మ్యూజియం అసిస్టెంట్ క్యూరేటర్ కుర్సం రవి ఆధ్వర్యంలో నిర్వహించారు. గట్టమ్మ దేవాలయం వద్ద ఆదివాసీ నాయకపోడు జిల్లా అధ్యక్షుడు కొత్త సురేందర్ ఆధ్వర్యంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఉద్యోగ సంఘం జిల్లా అధ్యక్షుడు మంకిడి రవి, నాయకులు రవికాంత్, లక్ష్మయ్య, నరేశ్, సమ్మయ్య, మొగిలి, రాజు, రఘు, ముఖేశ్ పాల్గొన్నారు.

మంగపేట మండల కేంద్రంలో కుమ్రం భీం వర్ధంతిని గిరిజన సంఘాల జేఏసీ చైర్మన్ మద్దెల అంజయ్య, ప్రజా సంఘాలు, ఆదివాసీ ఉద్యోగ సంఘాల నాయకులు, పెసా మొబిలైజర్లు పాల్గొన్నారు. వెంకటాపురం(నూగూరు) మండల కేంద్రంలో ఆదివాసీ సంఘాల ఐక్య వేదిక ఆధ్వర్యంలో కుమ్రం భీం విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఐక్య వేదిక నాయకులు రాంచందర్, సోమరాజు, సతీశ్, రాంబాబు, వెంకటకృష్ణ, నారాయణమ్మ, రమాదేవి, లక్ష్మి, సుదర్శన్, నర్సింహారావు పాల్గొన్నారు.

కాటారం గిరిజన సంక్షేమ గురుకులంలో కుమ్రం భీం చిత్రపటానికి కళాశాల ప్రిన్సిపాల్ లాలు పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో వైస్‌ప్రిన్సిపాల్ రాజేందర్, జూనియర్ వైస్‌ప్రిన్సిపాల్ మాధవి, డిప్యూటీ వార్డెన్ శ్రీనివాస్, వెంకటయ్య, రాజు, హరిభూషణ్, రామకృష్ణ, చారి, పీఈటీలు మహేందర్, శ్రీనివాస్, వెంకటేశ్ తదితరులు పాల్గొన్నారు.

గ్రంథాలయ సంస్థ చైర్మన్‌గా రవిచందర్

రవిచందర్

ములుగురూరల్, అక్టోబర్ 17 : ములుగు జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్‌గా ములుగు మండలం జీవంతరావుపల్లి గ్రామానికి చెందిన బానోత్ రవిచందర్‌ను గురువారం నియమిస్తూ ప్రభుత్వ విద్యాశాఖ ప్రధాన కార్యదర్శి వెంకటేశం ఉత్తర్వులు జారీ చేశారు. మంత్రి సీతక్క అనుచరుడిగా, జిల్లా యువజన కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడిగా పనిచేసిన రవిచందర్‌కు నామినేటెడ్ పదవిలో ప్రాధాన్యత ఇస్తూ గ్రంథాలయ సంస్థ చైర్మన్‌గా నియమించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత జిల్లాలో తొలి నామినెటెడ్ పోస్టు రవిచందర్‌తో భర్తీ అయింది.

శివాలయాన్ని సందర్శించిన కలెక్టర్

ములుగురూరల్, అక్టోబర్ 17 : జాకారం గ్రామ శివారులోని పురాతన శివాలయాన్ని కలెక్టర్ టీఎస్ దివాకర గురువారం సందర్శించి పరిసరాలను పరిశీలించారు. ఆలయాన్ని ఉపయోగంలోకి తీసుకువచ్చేందుకు కృషి చేస్తామని అన్నారు. చుట్టు పక్కల ఉన్న పిచ్చి మొక్కలను తొలగించి ఆలయ హద్దులను గుర్తించి పూర్తి వివరాలను సమర్పించాలని అధికారులకు సూచించారు. గుడిని అభివృద్ధి చేసేందుకు పురావస్తుశాఖ అధికారులు ప్రతిపాదనలు రూపొందించాలని కలెక్టర్ ఆదేశించారు. ఆయన వెంట కాంగ్రెస్ నాయకులు గొల్లపల్లి రాజేందర్‌గౌడ్, సిబ్బంది ఉన్నారు.

పాలెం వాగు ప్రాజెక్టును పూర్తి చేయాలని వినతి

వెంకటాపురం(నూగూరు), అక్టోబర్ 17 : పాలెంవాగు ప్రాజెక్టు పనులను సకాలంలో పూర్తి చేయాలని ఆయకట్టు రైతులు గురువారం రెవెన్యూశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డితోపాటు ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావ్‌ను భద్రాచలంలో కలిసి వినతి పత్రం అందజేశారు. స్పందించిన మంత్రి నీటి పారుదలశాఖ అధికారులతో మాట్లాడి పనులను సకాలంలో చేపట్టాలని ఆదేశించారు.

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి

వెంకటాపురం(నూగూరు)/వాజేడు, అక్టోబర్ 17 : సీజనల్ వ్యాధుల బారిన పడకుండా ఉండేందుకు ప్రజలు తమ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని డీఎంహెచ్‌వో డాక్టర్ అల్లెం అప్పయ్య అన్నారు. గురువారం గంగారం గ్రామంలో ఆయన పర్యటించి గ్రామస్తులతో మాటాడారు. అందుతున్న వైద్య సేవల గురించి అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట వైద్యాధికారిణి భవ్యశ్రీ, సిబ్బంది యాకలక్ష్మి, రాఘవులు, సరస్వతి, గ్రామస్తులు ఉన్నారు. ఎడ్జర్లపల్లి జీపీ పరిధిలోని కొత్తూరు గ్రామంలో నిర్వహిస్తున్న కంటైనర్ అదనపు ఆరోగ్యఉపకేంద్రాన్ని డీఎంహెచ్‌వో అలెం అప్పయ్య పరిశీలించారు. రోగులకు అందుతున్న వైద్య సేలవను అడిగి తెలుసుకున్నారు.

క్రష్ సెంటర్లను ఉపసంహరించుకోవాలి

ములుగురూరల్, అక్టోబర్ 17 : క్రష్ సెంటర్ల ఏర్పాటు నిర్ణయాన్ని ప్రభుత్వం ఉపసంహరించుకోవాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి రత్నం రాజేందర్ కోరారు. గురువారం ములుగులో అంగన్‌వాడీలతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ క్రష్ అనే స్వచ్ఛంద సంస్థ ద్వారా బాలల సంరక్షణ పేరుతో అంగన్‌వాడీ సెంటర్లను ప్రైవేటీకరణ చేస్తున్నారని అన్నారు. సమావేశంలో జిల్లా కార్యదర్శి సమ్మక్క, ప్రేమకుమారి, జమునారాణి, రమాదేవితోపాటు 100మంది అంగన్‌వాడీలు పాల్గొన్నారు.

ఇద్దరు గంజాయి స్మగ్లర్ల అరెస్టు

రేగొండ, అక్టోబర్ 17 : గంజాయి తరలిస్తున్న ఇద్దరిని అరెస్టు చేసినట్లు ఎస్సై సందీప్‌కుమార్ తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. ఆంధ్రప్రదేశ్‌లోని సీలేరుకు చెందిన కనుకం కల్యాణ్, ముస్కె రవితేజ ఎండు గంజాయి కొనుగోలు చేసి ద్విచక్ర వాహనంపై హనుమకొండకు తరలిస్తున్నారనే సమాచారంతో సిబ్బందితో కలిసి కొత్తపల్లి క్రాస్ రోడ్డు వద్ద వారిని తనిఖీ చేశామన్నారు. 300 గ్రాముల ఎండు గంజాయి, రెండు సెల్ ఫోన్లు, ద్విచక్ర వాహనాన్ని స్వాధీనం చేసుకొని నిందితులపై కేసు నమోదు చేసినట్లు చెప్పారు.

డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులో ఏడుగురికి జైలు

చిట్యాల (మొగుళ్లపల్లి)/కృష్ణకాలనీ, అక్టోబర్ 17 : మొగుళ్లపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో డ్రంక్ అండ్ డ్రైవ్‌లో పట్టుబడిన వారికి కోర్టు జైలు శిక్ష విధించినట్లు ఎస్సై అశోక్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. ఇటీవల మండలంలో డ్రంక్ అండ్ డ్రైవ్ నిర్వహించగా కమలాపూర్ మండలం అంబాల గ్రామానికి చెందిన దురిశెట్టి నవీన్, టేకుమట్ల మండలం గుమ్మడివెల్లి గ్రామానికి చెందిన తోడేటి ఓంకార్, ముల్కలపల్లికి చెందిన ఇరుప సురేశ్, వేములపల్లికి చెందిన తిప్పరబోయిన సతీశ్ మద్యం సేవించి వాహనాలు నడుపుతూ పట్టుబడ్డారన్నారు. వారిని గురువారం జిల్లా కోర్టులో హాజరుపర్చగా న్యాయమూర్తి రెండు రోజుల జైలు శిక్షతోపాటు రూ.వెయ్యిచొప్పున జరిమానా విధించారన్నారు. అలాగే గణపురం మండలం చెల్పూర్ గ్రామానికి చెందిన సిలువేరు హరీశ్‌కు మూడు రోజుల జైలు శిక్షతోపాటు రూ.వెయ్యి జరిమానా విధించినట్లు ఎస్సై వివరించారు. అలాగే భూపాలపల్లి జిల్లా కేంద్రంలో వాహన తనిఖీలు చేస్తుండగా ఇద్దరు వ్యక్తులు మద్యం సేవించి పట్టుబడినట్లు సీఐ నరేశ్‌కుమార్ తెలిపారు. జిల్లా జడ్జి ఎదుట హాజరుపర్చగా వారికి రెండు రోజు లు జైలు శిక్ష, రూ.వెయ్యి చొప్పున జరిమానా విధించినట్లు సీఐ చెప్పారు.

ఎంబీబీఎస్ విద్యార్థికి ఆర్థిక సాయం

ఏటూరునాగారం, అక్టోబర్ 17 : శంకరాజుపల్లి గ్రామానికి చెందిన జనగాం రాజేశ్ మంచిర్యాలలో ఎంబీబీఎస్‌లో సీటు సాధించాడు. సీట్ ఉచితం అయినప్పటికీ ఏడాదికి రూ.లక్ష వరకు ఖర్చు కానున్నాయి. ఈ నేపథ్యంలో రాజేశ్ తల్లిదండ్రులు నిరుపేదలు కావడంతో తమ కుమారుడి చదువుకు అయ్యే ఖర్చులు భరించలేమని, దాతలు ముందుకు వచ్చి ఆదుకోవాలని వారు కోరారు. విషయం తెలుసుకున్న నేతాజీ ఫౌండేషన్ వరంగల్ కీలక సభ్యుడు, ఏటూరునాగారానికి చెందిన ఉపాధ్యాయుడు గజ్జెల సుమన్, ఖమ్మంకు చెందిన సుగ్గాల మురళి , సుగ్గాల నిఖిల ఆధ్వర్యంలో సేకరించిన రూ.10వేలను గురువారం రాజేశ్‌కు అందజేశారు.

భూ సేకరణ సర్వేను అడ్డుకున్న రైతులు

మహదేవపూర్ (కాళేశ్వరం) అక్టోబర్ 17: కాళేశ్వరం గ్రామంలో గురువారం అధికారులు చేపట్టిన నేషనల్ హైవే -353కి సంబంధించి భూసేకరణ, ఎంజాయ్‌మెంట్ సర్వే పనులను రైతులు అడ్డుకున్నారు. రహదారికి తమ భూములు ఇచ్చేది లేదని అభ్యంతరం చెప్పడంతో అధికారులు వెనుదిరిగారు. కార్యక్రమంలో నేషనల్ హైవే డీఈ కిరణ్ కుమార్, డిప్యూటీ తహసీల్దార్ కృష్ణ, డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ గణేశ్‌జాదవ్, సర్వేయర్ రాజారమేశ్, ఆర్ఐ జగన్మోహన్‌రెడ్డి పాల్గొన్నారు.

ఐటీఐకి దరఖాస్తులు చేసుకోవాలి

మంగపేట, అక్టోబర్ 17 : పదో తరగతి ఉత్తీర్ణులై ఐటీఐ కోర్సు చేయాలనుకునే ఔత్సాహిక విద్యార్థులు ఈనెల 19లోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకోవాలని ఇన్‌చార్జి తహసీల్దార్ మల్లేశ్వర్‌రావు బుధవారం తెలిపారు. https://iti.telangana.gov.in వెబ్ సైట్‌లో తమ దరఖాస్తులు అప్‌లోడ్ చేసుకోవాల్సిందిగా ఆయన సూచించారు.

న్యాయం చేయాలని మృతదేహంతో రాస్తారోకో


మృతదేహంతో రాస్తారోకో చేస్తున్న కుటుంబ సభ్యులు

భూపాలపల్లి రూరల్, అక్టోబర్ 17 : గణపురం మండలం జంగుపల్లి గ్రామానికి చెందిన మృతుడు పేరాల వెంకటేశ్వర్‌రావు కుటుంబానికి న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ భూపాలపల్లి వంద పడకల దవాఖాన ఎదురుగా ఉన్న జాతీయ రహదారిపై బంధువులు గురువారం రాస్తారోకో నిర్వహించారు. రోడ్డు ప్రమాదానికి కారణమైన లారీ ఓనర్, డ్రైవర్ రావడంతో పాటు వెంకటేశ్వర్‌రావు కుటుంబానికి నష్ట పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. విషయం తెలుసుకున్న పోలీసులు అక్కడికి చేరుకొని బంధువులతో మాట్లాడారు. లారీ ఓనర్‌తో మాట్లాడి ప్రస్తుతానికి నష్టపరిహారం కింద రూ. 50 వేలు ఇచ్చే విధంగా, మరేదైనా విషయం ఉంటే రేపు మాట్లాడుకోవాలని నచ్చజెప్పడంతో ఆందోళన విరమించారు. మృతదేహాన్ని అంత్యక్రియలకు జంగుపల్లి గ్రామానికి తీసుకెళ్లారు.